క్లుప్తంగా

రేపు చిల్లకల్లులో సచివాలయం ప్రారంభం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ఈనెల 26వతేదీ సాయంత్రం మూడుగంటలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జగ్గయ్యపేట రోడ్డులో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలతో పాటు సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

చురుగ్గా కులగణన సర్వే

వీరులపాడు: మండలంలో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. మండలంలోని జయంతి గ్రామంలో కార్యదర్శి పాండురంగారావు ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బుధవారం ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబసభ్యుల కులం వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసిన గ్రూప్–1, గ్రూప్–2, ఎస్ఎస్సీ పరీక్షలకు సంబంధించి 16 పుస్తకాలను ప్రదర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ తెలిపారు. పుస్తక ప్రదర్శనలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ కొడాలి బాలగంగాధర తిలక్, విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం



కె.లక్ష్మీకల్యాణి


పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లచే ప్రతిజ్ఞ, ఓటు ప్రాధాన్యం తెలియజేస్తూ ముగ్గుల పోటీలు, సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఓటర్లంతా పాల్గొనాలని ఆమె కోరారు.

458 మందికి వైద్యపరీక్షలు



నందిగామ: రాష్ట్రంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 9 వ సచివాలయ పరిధిలోని డీవీఆర్ కాలనీలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సీతారామమ్మ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని 458మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కమిషనర్ డాక్టర్ జయరాం మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలోని ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



గౌరవరం(జగ్గయ్యపేట): పాడి రైతులు లేగదూడల పెంపకంలో పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుగణాభివృద్ధి ఉప సంచాలకుడు శ్రీనివాసరావు సూచించారు. గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాడిరైతులకు చెందిన లేగదూడలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. నాలుగేళ్లలో గ్రామాల్లో పాల దిగుబడి రెట్టింపయ్యే అవకాశం ఉందని, తద్వారా పశుపోషకుల ఆదాయం పెరుగుతుందని వివరించారు. లేగదూళ్ల ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి ముత్తవరపు పావని వెంకటేష్, నందిగామ ఉప సంచాలకుడు వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, పశువైద్యులు విశ్వజరాజ్, మురళీకృష్ణ, సొసైటీ చైర్మన్ అన్నాబత్తుల శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరెడ్డి, బాలసైదా, మైనేని కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



గొట్టుముక్కలలో ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

గొట్టుముక్కల(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపాలనలో రాష్ట్రానికి చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు ఆయనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతిగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ఇంటి ముంగిటికే తీసుకువచ్చి, గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడుపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుదే అక్కారావు, శివాలయం ఆలయ చైర్మన్ ఆలోకం శ్రీనివాస్, గుదే సాంబశివరావు, తంగెళ్లమూడి రామారావు, సొసైటీ అధ్యక్షులు ఆలోకం శ్రీనివాసరావు, న్యాయవాదులు మంగలపూడి కోటిబాబు, మంగలపూడి సన్నీ, కృష్ణ ప్రసాద్, యలమందల భాస్కరరావు, చంద్రాల తిరుపతిరావు, కొండలరావు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, బుడ్డి సత్యనారాయణ, వేల్పుల రమేష్, ఉప్పులూరు ప్రసాద్, మణి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో జనార్దన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కునికెనపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

గ్రామాల అభివృద్ధిపై సమీక్ష..

కంచికచర్ల : గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకు ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20లక్షలు కేటాయిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. ఆ నిధులతో గ్రామాల్లో చేపట్టే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. మండలంలోని కునికెనపాడు గ్రామంలో కునికెనపాడు, మున్నలూరు, చెవిటికల్లు గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పై మూడు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను తనదృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామసచివాలయానికి మంజూరైన రూ.20లక్షలతో ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో చెవిటికల్లు, కునికెనపాడు సర్పంచులు బుడ్డి విజయలక్ష్మి, బండారుపల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుడ్డి సత్యనారాయణ, నాయకులు రాయల నరసింహారావు, వెలుగలేటి బాబు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సాయి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నందిగామలో మహిళా ఓటర్లే కీలకం

నందిగామ: నందిగామ శాసనసభ నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, తాజాగా ప్రకటించిన ఓటర్ల తుదిజాబితా ప్రకారం మొత్తం 2,03,322 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్డీవో పి.సాయిబాబు తెలిపారు. మొత్తం ఓటర్లలో పురుషులు 98,530మంది ఉండగా, మహిళలు 1,04,784మంది ఉన్నారు. ఇతర ఓటర్లు ఎనిమిది మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్య 6,254 అధికం. 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో ఓటర్లు 8,311మంది పెరిగారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో 1,95,011 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 99,361మంది, పురుషులు 95,642 మంది, ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు. 2019 ఎన్నికల సమయంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 3719మంది అధికంగా ఉండగా, ఈసారి ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లు, పురుషుల కంటే 6,254మంది అధికంగా ఉన్నారు. గత ఎన్నికల సమయంలో పురుష, మహిళా ఓటర్ల మధ్య ఉన్న వ్యత్యాసం ఈసారి రెట్టింపు అయ్యింది.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

చందర్లపాడు మండలంలో మొత్తం 48,335మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళా ఓటర్లు 24,687 మంది, పురుషులు 23,647, ఇతరులు ఒక ఓటరు ఉన్నారు. నందిగామ మండల పరిధిలో మొత్తం 23,315మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 11,987మంది, పురుషులు 11,326 మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు. నందిగామ పట్టణంలో మొత్తం 36,048 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళా ఓటర్లు 18,758 మంది, పురుషులు 17,288మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. వీరులపాడు మండలంలో మొత్తం 40,109మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళా ఓటర్లు 20,676మంది, పురుషులు 19,432 మంది, ఇతరులు ఒక్కరు ఉన్నారు. కంచికచర్ల మండలంలో మొత్తం 55,515మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 28,676 మంది, పురుషులు 26,837 మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు. మొత్తం మీద నందిగామ నియోజకవర్గంలో ప్రతి మండలంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో పురుష ఓటర్లు 95,642మంది ఉండగా వారిలో 88.39% శాతం మంది అనగా 84,514మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు 99,361మంది ఉండగా వారిలో 87.13% మంది అనగా 86,575మంది మహిళలు తమ ఓటును వినియోగించుకున్నారు.

జాబితాను సరిచూసుకోవాలి: ఆర్డీవో

నందిగామ నియోజకవర్గ ఓటర్ల తుదిజాబితాను ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు ఆర్డీవో సాయిబాబా తెలిపారు. ఓటర్లు ఆయా పోలింగ్‌కేంద్రాలను సందర్శించి, జాబితాను పరిశీలించుకోవచ్చని ఆర్డీవో వివరించారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు (ఫైల్)

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



సీఎం జగనన్న ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు

నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 66మంది విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి బొల్లినేని పద్మ మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి గర్వంగా చెప్పుకునే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మార్కపాడి గురుస్వామి, ప్రధానోపాధ్యాయుడు ఆళ్ళ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

44 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: తెలంగాణ రాష్ట్రం మధిర ప్రాంతం నుంచి నందిగామకు తీసుకువస్తున్న మద్యం సీసాలను బుధవారం నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ కథనం మేరకు..మధిర నుంచి ఇద్దరు వ్యక్తులు 44 మద్యం సీసాలు తీసుకుని వస్తుండగా జొన్నలగడ్డ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

బాధ్యతల స్వీకరణ

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవోగా బి.గంగాధరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ యనమలకుదురు శివాలయం ఈవోగా పనిచేస్తున్న ఆయన నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు భద్రతపై వాహన చోదకులకు అవగాహన



జగ్గయ్యపేట పట్టణంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఐ రవికుమార్, సిబ్బంది

జగ్గయ్యపేట : వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జగ్గయ్యపేట ప్రాంతీయ రవాణాశాఖాధికారి రవికుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో వాహనచోదకులకు బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు, భద్రతపై గ్రామాల్లోనూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని వివరించారు. ముఖ్యంగా కర్మాగారాల యాజమాన్యాలు కూడా కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆలాం, కెసీపీ, రామ్‌కో సిమెంట్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

నందిగామ: వాహన చోదకులంతా తప్పకుండా రవాణాశాఖ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనచోదకులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత కోసం రవాణాశాఖ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగింపు



జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న పెనుగంచిప్రోలు సర్పంచి పద్మకుమారి

పెనుగంచిప్రోలు: వచ్చేనెలలో జరుగనున్న శ్రీతిరుపతమ్మవారి రంగుల ఉత్సవం, తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించుకుని పెనుగంచిప్రోలు–ముండ్లపాడు రోడ్డులో ఇరువైపులా ఉన్న కంపచెట్లను బుధవారం జేసీబీతో తొలగించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాలతో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా చెరువుకట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచి పద్మకుమారి మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామస్తులు, భక్తులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రాంతాల్లో చెత్తను వేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన జెండా స్థూపం ఏర్పాటు పనులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జగ్గయ్యపేట: పట్టణంలోని శాంతినగర్‌లో 150 అడుగులతో నిర్మిస్తున్న జాతీయ జెండాస్థూపం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయజెండాను ఆవిష్కరించనున్న నేపథ్యంలో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. జెండా స్థూపం నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ డీఈ కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఏఈ హనుమంతరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సునీల్, కౌన్సిలర్ వెంకట్రావ్, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ సభ్యుడు నంబూరి రవికుమార్, నాయకుడు అన్నెపాక రమేష్ ఉన్నారు.

ఆటో చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

విజయవాడస్పోర్ట్స్: విద్యాధరపురం ఐరన్ యార్డ్ వద్ద ఆటోను చోరీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.రాజశేఖర్ బుధవారం తీర్పు చెప్పారు. ఆటోను యార్డ్ ఎదుట పార్క్ చేసిన యజమాని.. యార్డ్ లోనికి వెళ్లి వచ్చే సరికి ఆ వాహనం కనిపించలేదు. 2023 జూలై తొమ్మిదో తేదీన జరిగిన ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడుకు చెందిన కారం నరేష్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టులో వాదనలు వినిపించారు. ముగ్గురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నరేష్‌కుపై విధంగా శిక్ష విధించారు.

ఉత్సాహంగా ఆడుదాం..ఆంధ్రా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న పెనుగంచిప్రోలు, చిల్లకల్లు జట్ల క్రీడాకారులు

జగ్గయ్యపేట అర్బన్: గ్రామీణ, పట్టణ యువతను క్రీడల్లో ప్రోత్సహించి, క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే గొప్పలక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మెగా ఈవెంట్‌ను తలపెట్టారన్నారు. పేట పట్టణం నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్ కాశి అనురాధ కిషోర్, ఎంపీడీవో మేకా రమేష్ బాబు, పీడీలు ఎం.శ్రీనివాసరావు, గంటా వెంకటేశ్వర్లు, సరోజ, సునీత, నాగేశ్వరరావు, సోడానాయక్, ఫిలిప్, కృష్ణ, మణిరత్నం, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆయా పోటీలు ఎంతో ఉత్సాహంగా, ఉత్కంఠభరితంగా సాగాయి. క్రీడలను వందలాది మంది ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు.

ఆయా పోటీల విజేతలు వీరే..

- స్థానిక ఎస్‌జీఎస్ కళాశాలలో నిర్వహించిన జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయి పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో పెనుగంచిప్రోలు–2 జట్టుపై జగ్గయ్యపేటలోని రంగస్వామి బజారు సచివాలయం జట్టు గెలుపొందింది.
- స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల బ్యాడ్మింటన్ పోటీల్లో వత్సవాయి మండలం మంగొల్లు–1జట్టుపై జగ్గయ్యపేట రంగస్వామిబజారు జట్టు విజేతగా నిలిచింది. మహిళా విభాగంలో ముక్త్యాల జట్టుపై మంగొల్లు–1జట్టు గెలుపొందింది.
- స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో జరిగిన పురుషుల కబడ్డీ పోటీల్లో పెనుగంచిప్రోలు–2 జట్టుపై చిల్లకల్లు జట్టు గెలుపొందింది. మహిళల విభాగంలో సుబ్బాయిగూడెం జట్టుపై సోమవరం జట్టు విజేతగా నిలిచింది.
- మహిళల ఖోఖో పోటీల్లో వత్సవాయి–2 జట్టుపై గండ్రాయి–1జట్టు గెలుపొందింది.



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్మన్ ఆర్.రాఘవేంద్ర



క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, టి.ప్రభాకర్



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జగనన్న పాలనలో అందరికీ మేలు



మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపికచేసి వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మండలంలో 23లేఅవుట్‌లలో 4,159 మందికి ఇళ్లస్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయా జగనన్నకాలనీల్లో రోడ్లు, నీరు, విద్యుత్ సదుపాయం కల్పించినట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలు రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రెవెన్యూ అధికారి అనూష్ మాట్లాడుతూ మండలంలో 23,483 రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. 980మందికి ప్రభుత్వం అంత్యోదయ కార్డులను మంజూరు చేసిందని వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ టీవీ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 17 గ్రామసచివాలయ భవన నిర్మాణాల్లో ఇప్పటికే 12 భవనాల పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఐదు భవనాల పనులు వివిధ దశలో ఉన్నాయని వివరించారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ బాలశంకరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, డీఎల్‌పీవో బీ శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి.. ఎంపీపీ మలక్‌బషీర్

పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల బీసీ కాలనీలో ఎంపీపీ మలక్‌బషీర్ బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అనేక వీధుల్లో సీసీరోడ్లు, మురుగునీరు పారుదల కోసం డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని వివరించారు. మాజీ ఉపసర్పంచి షమీ ఉల్లా, బీసీ నాయకులు పాల్గొన్నారు.